క్లుప్తంగా

నివాళి



పాడిచంద్ర మృతదేహానికి నివాళులర్పిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మండలంలోని బొక్కిసంపాళెంలో గురువారం వైఎస్సార్‌సీపీ నేత పాడి చంద్ర మృతిచెందాడు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అంజూరు శ్రీనివాసులు అక్కడికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సుబ్రహ్మణ్యం, చెంగల్రాయులు, హరియాదవ్, శివయాదవ్, రామ్మూర్తి, ఆర్కాడు ముత్తు, సుబ్రహ్మణ్యంయాదవ్, నాగరాజు, శరవణకుమార్, కె.ఉదయ్‌కుమార్, మున్నారాయల్, బుల్లెట్ జయశ్యామ్ పాల్గొన్నారు.


చవితి వేడుకలకు అనుమతి తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు, విద్యుత్‌శాఖల అనుమతులు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. విగ్రహాలతో పాటు మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు పొందాలన్నారు. అనుమతులు పొందేందుకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. మండపాల వద్ద నిబంధనలు ఉల్లంఘించకూడదన్నారు.

నిబంధనలు పాటించండి

వరదయ్యపాళెం: వినాయక చవితి ఉత్సవాల్లో నిబంధనలు తప్పక పాటించాలని సత్యవేడు సీఐ మురళి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మండపాలు ఏర్పాటు చేయాలనుకునే వారు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ఇందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన పని లేదన్నారు. రహదారుల పక్కన మండపాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. డీజేలు ఏర్పాటు చేసి అల్లర్లు చేయొద్దని పేర్కొన్నారు. విగ్రహాల వద్ద రోజువారీ ఎవరో ఒకరు ఉండేలా కమిటీ సభ్యులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు కూడా కమిటీలు చొరవ తీసుకుని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు




రోగులకు పండ్లు, బ్రెడ్లు ఇస్తున్న చిరంజీవి అభిమానులు

శ్రీకాళహస్తి: పట్టణంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. జనసేన జిల్లా కార్యదర్శి కొట్టె సాయి, మెగాస్టార్ అభిమానులు మాధవ మహేష్, ఆస్పత్రి కమిటీ సభ్యులు కుమార్, గరికపాటి రమేష్‌బాబు, జనసేన నేతలు విజయకుమార్, ఈర్ల చిరంజీవి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నాగలాపురం: వినాయక చవితి ఉత్సవాలు నిబంధనలకు అనుగుణంగా జరుపుకోవాలని స్థానిక ఎస్‌ఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు సింగిల్‌విండో విధానంపై అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక చవితి ఉత్సవాలలో విగ్రహ ప్రతిష్ఠ కోసం రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఆన్‌లైన్ వెబ్‌సైట్ తీసుకొచ్చిందని, ఈ వెబ్‌సైట్ ద్వారా విగ్రహ మండపం ఏర్పాటు చేయాలనుకున్న నిర్వాహకులు నాలుగు రోజులు ముందే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండపం వద్ద రికార్డు డాన్సులు, అశ్లీల ప్రదర్శనలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువకులు వినాయక నిమజ్జనం రోజు అల్లర్లకు పాల్పడితే వారి మీద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైభవం.. పట్టాభిషేకం



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న ఉభయదారులు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం శ్రీకృష్ణ భజన మందిరంలో జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి మహోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శుక్రవారం స్వామివారి పట్టాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు గోవిందరెడ్డి, నారాయణరెడ్డి రోసమ్మ దంపతుల ఇంటి నుంచి స్వామివారికి పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూజా సామగ్రిని ఊరేగింపుగా దేవాలయానికి తీసుకొచ్చారు. సత్యభామ,రుక్మిణి సమేత శ్రీకృష్ణుని ఉత్సవ మూర్తులకు అర్చకులు పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య పట్టాభిషేక మహోత్సవాన్ని జరిపించారు. భక్తులు పట్టాభిషేక ఉత్సవాన్ని వీక్షించి తరించారు. ఆలయ నిర్వాహకులు ఇందుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు చేపట్టిన నాడు–నేడు సత్ఫలితాలను ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలలను కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అభివృద్ధి చెందాయి. వరదయ్యపాళెం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అన్ని హంగులతో అభివృద్ధి పనులు చేశారు. దీంతో కళాశాలకు నూతన శోభ సంతరించుకుంది. కళాశాలను సందర్శించిన విద్యార్థి, విద్యార్థుల తల్లిదండ్రులు గత ప్రభుత్వ ఆలోచనతో అభివృద్ధి చెందిన కళాశాల తీరుపై సర్వత్రా చర్చించడంతోపాటు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. అలాగే నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థకు ఇచ్చిన ప్రాధాన్యతకు వరదయ్యపాళెం జూనియర్ కళాశాలే అభివృద్ధికి నిదర్శనమని కితాబిస్తున్నారు. –వరదయ్యపాళెం

కళాశాలకు కొత్త శోభ

నాడు–నేడు నిధులతో అభివృద్ధి చెందిన వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాల



- గత ప్రభుత్వం నాడు–నేడులో జూనియర్ కళాశాల అభివృద్ధి
- రూ.61లక్షలతో కళాశాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు పూర్తి

వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 69 మంది, ద్వితీయ సంవత్సరంలో 74 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ కళాశాల అభివృద్ధికి గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు–నేడు ద్వారా రూ.61 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధుల ద్వారా పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణంతోపాటు విద్యార్థులు అదనపు స్టడీ అవర్స్ చదువుకునేందుకు రేకుల షెడ్ హాలు, విద్యార్థుల తాగునీటి కోసం రెండు ఆర్‌ఓ ప్లాంట్లు, విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించేందుకు తరగతి గదుల్లో 7 ఐఎఫ్‌బీ ప్యానెల్స్ ఏర్పాటు, సిమెంటు రోడ్డు, ప్రహరీ గోడ, కళాశాల భవనాలకు పూర్తిస్థాయిలో రంగులు, మరుగుదొడ్లు పనులను చేపట్టారు.

ప్రహరీ గోడ నిర్మాణం

కళాశాల ఏర్పాటు నుంచి ప్రధానంగా భద్రతా సమస్య తలెత్తింది. దీంతో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. గతంలో అనేక పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు ద్వారా నిధులు మంజూరు కావడంతో కళాశాల సరిహద్దుకు సంబంధించి 500 మీటర్ల మేరకు ప్రహరీ గోడ నిర్మించారు. దీంతో భద్రతా సమస్య తీరింది. అంతేకాక ఎంతో విలువైన కళాశాల స్థలం ఆక్రమణకు గురయ్యే పరిస్థితులు వైదొలిగాయి. అటు కళాశాల భద్రతతో పాటు కళాశాలకు చెందిన ఆస్తులకు భద్రత కలిగింది. ప్రధాన ద్వారం వద్ద ఆర్చి, గేటు ఏర్పాటు చేయడంతో పూర్తిస్థాయి భద్రత ఏర్పడింది. అంతేకాక ఓ ఆదర్శ కళాశాలగా అభివృద్ధి చెందింది.



కళాశాల ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన నూతన ఆర్చి, గేటు



నిర్మించిన ప్రహరీ గోడ



కళాశాల గదుల్లో ఐఎఫ్‌బీ డిజిటల్ బోర్డులు

అన్ని వసతులు ఉన్నాయి



మా కళాశాల నాడు–నేడు ద్వారా అభివృద్ధి చెందింది. అన్ని మౌలిక వసతులు ఉన్నాయి. చక్కటి వాతావరణంలో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా మా కళాశాల అభివృద్ధి చెందింది. తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డుల ద్వారా విద్యాబోధన మాకు సులభతరంగా మారింది. అభివృద్ధికి చొరవ చూపిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. –ఇంద్రసేన, ఇంటర్ విద్యార్థిని, వరదయ్యపాళెం

పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు



కళాశాల పునర్నిర్మాణ పనులకు రూ.61 లక్షలు గత ప్రభుత్వం మంజూరు చేసింది. తల్లిదండ్రుల కమిటీ ద్వారా నాణ్యతతో కూడిన పారదర్శకమైన పనులు చేపట్టాం. ప్రస్తుతం కళాశాలకు అన్ని వసతులు సమకూర్చాం. అదే స్థాయిలో అధ్యాపకుల నుంచి కూడా విద్యాబోధనలు జరుగుతాయి. ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విలువలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తాం. –రఘుపతి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్, వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆస్పత్రి ముఖద్వారం రోడ్డుకు మరమ్మతులు



ఆస్పత్రి ముఖద్వారం వద్ద వేసిన తారురోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

శ్రీకాళహస్తి: అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ఆస్పత్రి ముఖద్వారం రోడ్డుకు మరమ్మతులు చేసి బాగు చేశారు. ఇటీవల సాక్షి దినపత్రికలో ఆస్పత్రి రోడ్లపై కథనం రావడంతో అధికారులు స్పందించారు. ఆస్పత్రి ముఖద్వారం వద్ద గుంతల మయంగా ఉన్న రోడ్డును శుక్రవారం తారురోడ్డుగా ఏర్పాటు చేశారు. దీంతో రోగులు, వారి బంధువులు కాస్త ఉపశమనం పొందారు. అయితే ఆస్పత్రిలోని రోడ్లను మాత్రం పట్టించుకోలేదు. ఎటు చూసినా గుంతలమయంగా ఉంది. ఆస్పత్రి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

108 వాహనం తనిఖీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో శుక్రవారం 108 వాహనాలను డీఎం సురేష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. భవ్య హెల్త్‌కేర్ సర్వీసెస్ సీఓఓ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ సాయిరాం స్వరూప్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా 108 వాహనాల తనిఖీలు నిర్వహించారు. 108లో వసతుల గురించి పరికరాలు, రికార్డులను పరిశీలించారు. శ్రీనివాసులు, చిన్నముని పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం





సత్యవేడు గంగమ్మకు 109 కొబ్బరికాయలు కొట్టిన నూకతోటి రాజేష్, సత్యవేడులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేయడం దుర్మార్గం
- రాజకీయ కుట్రతోనే కక్ష సాధింపు
- లిక్కర్ కేసు.. అంకెల గారడీ
- త్వరగా బెయిల్ రావాలని గంగమ్మకు పూజలు

సత్యవేడు: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై నమోదు చేసిన అక్రమ కేసులను వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఖండించారు. గురువారం సత్యవేడులో ఏడు మండలాల వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి నూకతోటి రాజేష్ వైఎస్‌ఆర్ విగ్రహం నుంచి గంగమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. త్వరగా బెయిల్ రావాలని, అక్రమ కేసుల నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు రావాలని గంగమ్మను పూజించి 109 కొబ్బరి కాయలు కొట్టారు. ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని అణగదొక్కడానికి మిథున్‌రెడ్డిని తప్పుడు లిక్కర్ కేసులో ఇరికించారని మండిపడ్డారు. సత్యవేడుకే కాదు రాయలసీమకే పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి మార్గదర్శకులని పేర్కొన్నారు. రాజకీయ కుట్రలతోనే వైఎస్ఆర్ సీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వారికి నచ్చని వారిపై పథకం ప్రకారం తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. వ్యక్తిగతంగా పెద్దిరెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేశారని, రాజకీయంగా ఎదుర్కోలేక అధికారాన్ని అడ్డుపెట్టుకొని తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్ఆర్ సీపీ శ్రేణులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి వెనుకే ఉంటాయని పేర్కొన్నారు.

లిక్కర్ కేసులో... అంకెల ఆట

లిక్కర్ కేసులో మొదటగా రూ.50 వేల కోట్లు అవినీతి జరిగిందని పేర్కొన్నారని, తరువాత రూ.30 వేల కోట్లు అన్నారని, మూడోసారి 18 వేల కోట్లు అవినీతి అన్నారని ఆయన తెలిపారు. ఇప్పుడు రూ.3 వేలు కోట్లు కూడా కాదు రూ.2 వేల కోట్లు అవినీతి జరిగిందంటూ నోటి కొచ్చినట్లు మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కేవీ నిరంజన్‌రెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ మాజీ చైర్మన్లు ఏవీఎం బాలాజీ రెడ్డి, ఏవీఎం మునిశేఖర్ రెడ్డి, సర్పంచ్ రమేష్, ఎంపీ రవి, కేవీబీపురం నాయకులు గవర్ల కృష్ణయ్య, మాధవీ రెడ్డి, లాల్‌బాబుయాదవ్, గురునాథ, వరదయ్యపాళెం మండల నాయకులు దయాకర్‌రెడ్డి, చిన్నా, మహేంద్ర, శ్యాం,సెంథిల్, పునీతకుమార్, సోమశేఖర్, దయాళన్ మహిళా నాయకురాలు మస్తాని, పళణి, సుధాకర్‌రాజు, రాబర్టు, మోహన్ రెడ్డి, శరవణన్, సురేష్, కృష్ణయ్య, కుమార్, శ్రీధర్ రెడ్డి, ఇస్మాయిల్, రాబిన్, సోము, ఏసు, కుమార్ పాల్గొన్నారు.

పండుగకు నోచుకోని ఆగ్నేయ గణపతి



గణపతి ఆలయం వద్ద మురుగుకాలువను పరిశీలిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- మురికి కూపంగా ఆగ్నేయ వినాయకస్వామి మూలస్థానం
- పండుగలోపు చేయలేనప్పుడు ఎందుకు తవ్వారు

శ్రీకాళహస్తి: వాయు లింగేశ్వర దివ్య క్షేత్రంలో నవ సంధి వినాయకుల్లో ఒకటైనా ఆగ్నేయ గణపతి పునాదుల్లో మురుగునీరు చేరి దుర్గంధభరితంగా మారిందని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆగ్నేయ గణపతి గుడి పునః నిర్మించడానికి తీసిన పునాదులను ఆయన మాజీ పాలకమండలి చైర్మన్ అంజూర్ తారక శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆగ్నేయ గణపతికి వినాయక చవితి లేకుండా చేసిన పాపం కూటమి ప్రభుత్వానికి చుట్టుకుంటుందని ఎద్దేవా చేశారు. ఆలయాన్ని పునః నిర్మించాలని అనుకోవడం తప్పులేదని అయితే దానికి సమయం, సందర్భం చూసుకుని చేయాలని అన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా వినాయకస్వామి ఆలయ పునాదుల్లోకి మురుగునీరు చేరడం బాధాకరం అన్నారు. అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరిందని విమర్శించారు. ఆలయ పునాదుల్లోకి చేరుతున్న మురుగుకాలువ నీటిని పక్కకు మళ్లించి పునర్నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. బాలాలయం చేసి కూడా పనులు ఆపడం సమంజసం కాదన్నారు. ఆలయాన్ని పూర్తి చేయకుంటే వ్యక్తిగతంగా మేమే ఆలయ నిర్మాణం పనులు చేపడతామని అన్నారు. అంజూరు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అన్ని ఆలయాలకు జీర్ణోద్ధరణ చేశామని ఈ ఆలయానికి కూడా పునర్నిర్మాణానికి సన్నద్ధమవగా ఎన్నికల కోడ్ కారణంగా ఆగిందని తెలిపారు. వెంటనే మురుగునీటిని మళ్లించి ఆలయం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు రాయల్, బుల్లెట్ జయశ్యామ్, మాజీ కౌన్సిలర్ శరవణ కుమార్, కంట ఉదయ్‌కుమార్, నియోజవర్గ యువత అధ్యక్షుడు సుర సురేష్, నియోజవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్, జీవీకే రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయండి



సమావేశంలో సీఐటీయూ నేతలు

రేణిగుంట: చైనాకు చెందిన వింగ్ టెక్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. రేణిగుంట సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం బాలకృష్ణ అధ్యక్షతన ప్రాంతీయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మురళి మాట్లాడుతూ పారిశ్రామికవాడల్లో పెరుగుతున్న శ్రమ దోపిడీ, ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు. 2019వ సంవత్సరంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వింగ్ టెక్ యాజమాన్యానికి అనేక రాయితీలు ఇచ్చి 75 ఎకరాల భూమిని కట్టబెట్టారని అన్నారు. ఈ కారణంగా రూ.1,068 కోట్ల పెట్టుబడులు పెడతామని, పదివేల మందికి పైగా ఉపాధి కల్పిస్తామని వింగ్ టెక్ యాజమాన్యం చెప్పిందని ఆచరణలో అవేమీ పాటించకుండానే, పరిశ్రమను మూసివేత దిశగా నడిపిస్తున్నదని ఆరోపించారు. మోసపూరితంగా వ్యవహరించి ప్రభుత్వాన్ని, కార్మికులను, మోసగించిన యాజమాన్యంపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహించకుండా అన్ని పరిశ్రమల్లో భద్రతా వైఫల్యాలపై తనిఖీలు నిర్వహించి కఠినంగా వ్యవహరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, పుల్లయ్య, గురవయ్య, మునిరాజా, హరి, ఓవీ రమణ, సెల్వరాజు, ఈశ్వరి, రాజేశ్వరి, కరీముల్లా పాల్గొన్నారు.

ఏ పార్టీకీ టచ్‌లో లేను

- సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: తాను ప్రతిపక్ష పార్టీతో టచ్‌లో ఉన్నానని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ఇదంతా ఇటీవల సత్యవేడు నియోజకవర్గంలోకి చొరబడ్డ వెన్నుపోటుదారుల కుట్రలో భాగమేనని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారాలు, దోపిడీలు, కుట్ర రాజకీయాలు తనకు చేత కావని ఆదిమూలం స్పష్టం చేశారు. ముడుపులు అందుకున్న కుట్రదారులు నేటి వరకు నోరు మెదపకపోవడం వారి కుట్రలకు నిదర్శనమన్నారు. ఇటీవల నియోజకవర్గ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన శంకర్‌రెడ్డి పోలీసుల ప్రోటోకాల్ లేనిదే పర్యటనలకు వెళ్లలేక పోతున్నారని, తాను ఏనాడు ప్రోటోకాల్ కోసం ఆరాటపడలేదన్నారు. తనపై ఎన్ని కుట్రలు జరిగినా సంయమనంతో ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతూ ప్రజలకు అండగా నిలుస్తానని తెలిపారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



బుచ్చినాయుడుకండ్రిగలో శ్రావణ శుక్రవారం పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహిళలు ఆఖరి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని వరలక్ష్మి వ్రత పూజలు ఘనంగా చేశారు. శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారికికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. ఉత్సవమూర్తులను పూలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అర్చకులు వేద మంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో మహిళలు శ్రీలక్ష్మీదేవి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పులిహోర, దద్దోజనం, పంచామృతం, తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న మేట్

- ఏపీఓకు కూలీల ఫిర్యాదు



ఏపీఓతో మాట్లాడుతున్న కూలీలు

రేణిగుంట: గతంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను రాజకీయ వేధింపులతో తొలగించి నూతనంగా పెట్టిన మేట్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని ఉపాధి కూలీలు ఏపీఓకు ఫిర్యాదు చేశారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు శుక్రవారం ఏపీఓ దీపను కలిసి మేట్‌పై ఫిర్యాదు చేశారు. కూలీలు మాట్లాడుతూ గత మూడు నెలలుగా కూలి డబ్బులు ఇంకా రాలేదని తెలిపారు. మేటుగా పనిచేస్తున్న శ్రీనివాసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 15 రోజులు పని చేసిన మాకు మస్టర్ వేయలేదని తెలిపారు. ఉన్నతాధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు. ఏపీఓను వివరణ కోరగా కూలి డబ్బులు అందరికీ రావాల్సి ఉందని అన్నారు.

చమర్తికండ్రిగ క్వారీల్లో సర్వే చేయాలి

సత్యవేడు: పీవీపురం పంచాయతీలో ఉన్న అక్రమ క్వారీల్లో క్షేత్రస్థాయిలో సర్వే చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ కోరారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చమర్తికండ్రిగలోని క్వారీల యజమానులు అటవీభూములు, చెక్‌డ్యాంలు, గుడిమాన్యాలు, గిరిజనులు, దళితులకు ఇచ్చిన పట్టాభూములను ఆక్రమించారన్నారు. గిరిజనులు అటవీ ప్రాంతానికి వెళ్లే దారికి ఆక్రమించి గోతులు తీస్తున్నారని ఆరోపించారు. క్వారీ యజమానులు పంచాయతీలకు చెందాల్సిన రాయల్టీ సక్రమంగా కట్టడం లేదన్నారు. దీంతో పంచాయతీల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ ప్రాంతంలో గిరిజనులు, దళితులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దుర్మార్గం



మణినాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న దివ్యాంగుల పింఛన్లను ఆంక్షల పేరుతో తొలగించడం కూటమి ప్రభుత్వ దుర్మార్గపు చర్యకు పరాకాష్ట అని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొణతనేని మణినాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పింఛన్ల తీరుపై కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఖండించారు. ఏళ్ల తరబడి వస్తున్న పింఛన్ల ఇలా తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. సదరం సర్టిఫికెట్‌లో గతంలో 80 శాతం వరకు ప్రత్యేక ప్రతిభావంతులుగా గుర్తించిన వైద్యులు నేడు అదే వ్యక్తులకు 30 నుంచి 40 శాతం మాత్రమే ఇవ్వడం కూటమి ప్రభుత్వ కుతంత్రాలకు నిదర్శనమన్నారు. అనారోగ్య సమస్యలతో కకావికలం అవుతున్న వారి పింఛన్లు తొలగించడం, వారి గోడు చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని, అనేక ఆంక్షలు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఇలాంటి చర్యలు మానుకుని ప్రత్యేక ప్రతిభావంతులకు యథావిధిగా పింఛన్లు కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్

శ్రీకాళహస్తి: వర్షాకాలంలో వచ్చే రోగాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ అన్నారు. పట్టణంలోని ఎస్వీపీ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు బాపనయ్య, తులసి, సునిత, సుధీర్ పాల్గొన్నారు. కళాశాలలో సరస్వతీదేవి విగ్రహం ప్రతిష్ఠించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

అన్నదాత సుఖీభవ చెక్కు పంపిణీ

వరదయ్యపాళెం: మండలంలో అన్నదాత సుఖీభవ ద్వారా రూ.2.94 కోట్లు నగదు జమ అయినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రైతులతో జరిగిన కార్యక్రమంలో మెగా చెక్కును రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీని అమలు చేసినట్లు తెలిపారు. ముందుగా ముస్లింపాళెం లక్ష్మీపురం గ్రామాల్లో వేసిన సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.